



మహబూబాబాద్ ఫారెస్టు సెంటర్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ

మత్తులో పడి చిత్తు కావొద్దు

గంజాయి మత్తులో పడి యువత బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఫారెస్టు సెంటర్‌లో ఆయన బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ పట్టణంలోని పలు వీధుల మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు జరిగింది. ఈ సందర్భంగా ఆయన యువతకు పలు సూచనలు చేశారు.

వివరాలు 8లో..

పచ్చదనానికి ప్రణాళిక

పదో విడత హరితహారానికి సర్వం సిద్ధం

- జిల్లా టార్గెట్ 24.08 లక్షల మొక్కలు
- 17 శాఖలకు లక్ష్యాల కేటాయింపు
- అత్యధికంగా డీఆర్‌డీవోకు 17 లక్షలు
- జూలై 1 నుంచి మొక్కలు నాటడం షురూ


మహబూబాబాద్ మండలం పర్వతగిరిలో నర్సరీని పరిశీలిస్తున్న ఉపాధి హామీ పీడీ సంతోష్‌కుమార్

మహబూబాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మొక్కవోని దీక్షతో సాగుతున్న హరితహారం ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం మార్చిన పేరుతో వన మహోత్సవంగా మారింది. స్వరాష్ట్రం సిద్ధించినప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హరిత తెలంగాణ కోసం అధికారులు ఆహర్నిశలు కృషి చేస్తున్నారు. జీవ వైవిద్యానికి మొక్కల పెంపకం ఎంతో అవసమని.. ఈ అవసరాన్ని గుర్తుంచుకుని ప్రతీ ఏటా జిల్లాల వారీగా లక్ష్యాలను కేటాయించి మొక్కలు నాటే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వర్షాకాలం ఆరంభంలో జూలై 1 నుంచి 31 వరకు వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పల్లెల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను గ్రామపంచాయతీ పాలకమండళ్లతో పాటు సంబంధిత శాఖల అధికారులకు అప్పగిస్తున్నారు. రాష్ట్రంలో అడవుల శాతం తగ్గి సకాలంలో వర్షాలు కురియకపోవడంతో వ్యవసాయ భూములు బీడు భూములుగా మారుతున్న తరుణంలో గత తొమ్మిది సంవత్సరాలుగా హరితహార కార్యక్రమానికి అధిక నిధులు కేటాయిస్తూ మొక్కలు నాటుతూ.. వాటినిసంరక్షిస్తూ అడవుల శాతాన్ని పెంచుతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 17శాఖల ద్వారా పదో విడతలో వన మహోత్సవంలో 24.08లక్షల మొక్కలు నాటేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ సారి అత్యధికంగా డీఆర్‌డీపీఏ శాఖకు 17 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యాన్ని కేటాయించారు.

వనమహోత్సవానికి సిద్ధం


తొర్రూరు మండలం ఫత్తేపురంలో నర్సరీలో ఏపుగా పెరిగిన మొక్కలు

వన మహోత్సవాన్ని ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 24.08 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్ధేశించింది. దీంతో జిల్లా అధికారులు శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాలను కేటాయించారు. జిల్లాలోని 461 గ్రామపంచాయతీల పరిధిల్లో 461 నర్సరీల్లో మొక్కలను పెంచి నాటేందుకు సిద్ధం చేశారు. అటవీశాఖ ఆద్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వివిధ నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. ఇక జీపీ నర్సరీల్లో కానుగ, యాప, చింత, జామ, కర్జూర, మామిడి, నిమ్మ, బత్తాయిలతో పాటు ఇండ్లలో నాటేందుకు పూల మొక్కలను కూడా పెంచారు. అవెన్యూ ప్లాం టేషన్, ఇళ్లలో మొక్కలు నాటేందుకు, రోడ్ల వెంట మొక్కలు నాటేందుకు సమాయత్తం కావాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రజల భాగస్వామ్యంతోనే..

రోజురోజుకు అడవులు అంతరించిపోవడం వల్ల కలిగే నష్టాలను ప్రజల్లో చైతన్యం కల్పిస్తే తప్ప హరితహారం (వన మహోత్సవం) విజయవంతం అయ్యే అవకాశం కనిపించడం లేదు. అడవులు అంతరించి పోవడం వల్ల వర్షాలు సకాలంలో కురియక పంటలు సరిగ్గా పండక భూగర్భజలాలు అడుగంటిపోయి అనావృష్టికి దారి తీసే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు ఆలసత్వం వీడి ప్రతీ ఒక్కరు హరితహారంలో భాగస్వాములై ప్రజలను చైతన్యం చేస్తూ మొక్కలను నాటాలి. నాటిన మొక్కలను సంరక్షించుకునేలా ప్రతీ ఒక్కరు బాధ్యత తీసుకోవాల్సి ఉంది.

శాఖల వారీగా మొక్కలు కేటాయింపులు ఇలా...	
శాఖలు	టార్గెట్
వ్యవసాయశాఖ	0.50 లక్షలు
బీసీ వెల్ఫేర్	0.05 లక్షలు
పంచాయతీరాజ్‌శాఖ	0.50 లక్షలు
డీఆర్‌డీవో	17.00 లక్షలు
ఎక్సైజ్‌శాఖ	0.10 లక్షలు
అటవీశాఖ	2.00 లక్షలు
వైద్య ఆరోగ్యశాఖ	0.05 లక్షలు
హర్టికల్చర్	1.00 లక్షలు
పరిశ్రమల శాఖ	0.05 లక్షలు
ఇంటర్ కళాశాల	0.03 లక్షలు
నీటిపారుదల శాఖ	0.15 లక్షలు
మైనార్టీ వెల్ఫేర్	0.05 లక్షలు
మునిసిపల్	1.40 లక్షలు
పోలీస్‌శాఖ	0.50 లక్షలు
ఆర్అండ్‌బీ	0.20 లక్షలు
విద్యాశాఖ	0.30 లక్షలు
ట్రైబల్ వెల్ఫేర్	0.20 లక్షలు
మొత్తం	24.08 లక్షలు

వనమహోత్సవానికి మొక్కలు రెడీ



శాంతకుమారి, డీఆర్‌డీవో ఏపీడీ, మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా హరితహారంలో భాగంగా వనహోత్సవ కార్యక్రమాన్ని జూలై 31 వరకు చేపట్టనున్నాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే 10వ విడత హరితహారంలో భాగంగా వనమహోత్సవం ద్వార మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభిస్తాం. అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ హరితహారం లక్ష్యాలను సాధిస్తాం. వనమహోత్సవంలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.


ప్లాంటేషన్ వేయొద్దని అటవీశాఖ అధికారులకు దండం పెట్టి ప్రాధేయపడుతున్న పోడు రైతు

ప్లాంటేషన్ పనుల అడ్డగింతకు యత్నం

- అధికారులు, పోడు రైతుల మధ్య వాగ్వాదం
- గూడూరు మండలం నాయకపల్లి, బొల్లేపల్లి అటవీ ప్రాంతంలో ఉద్రిక్తత

6

మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నేతలు, మునిసిపల్ కార్మికులు

మహబూబాబాద్ టౌన్, జూన్ 26: మునిసిపాలిటీ కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము దేవేందర్, కాంపెల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మునిసిపాలిటీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ అనుబంధ తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆద్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే పద్ధతుల్లో పనిచేస్తున్న కార్మికులు చాలీ చాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుమ్మరి కుంట్ల నాగన్న, తోట శ్రీనివాస్, కాగితం శ్రీనివాస్, పార్నంది కృష్ణ, ఆకారపు విజయ్, ఆవుల వెం కన్న, వెంగల్‌రావు, పద్మ, లక్ష్మి,అచ్చమ్మ, రామస్వామి, మురళి, వెంకట రామ నర్సయ్య, శంకర్, యాకయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

జిల్లాకు ఆరుగురు ఎస్సైల కేటాయింపు

మహబూబాబాద్ రూరల్, జూన్ 26 : మహబూబాబాద్ జిల్లాకు ఆరుగురు ఎస్సైలను కేటాయిస్తూ మల్టీజోన్-1 ఐజీ ఏవీ.రంగనాథ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ జిల్లాలో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎండి.నజీర్, సీహెచ్.అమరేందర్‌రెడ్డి, జి.రమేష్, ఎంకె.బేగ్, కె.సారంగపాణి, ఎస్.భీమారెడ్డిలకు ఎస్సైలు పదోన్నతి కల్పిస్తూ మహబూబాబాద్ జిల్లాకు కేటాయించారు. ఈ ఆరుగురు ఎస్సైలు త్వరలోనే మహబూబాబాద్ జిల్లాలో ఎస్సైలుగా బాధ్యతలు చేపట్టనున్నారు.

పారిశుధ్య పనులపై అలసత్వం ప్రదర్శించొద్దు

- మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి


గోపాలపురంకాలనీలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూన్ 26 : పట్టణంలో పారిశుధ్య పనుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని స్థానిక మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 11వవార్డు పరిధిలోని గోపాలపురం కాలనీలో బుధవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. కాలనీలో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య ఉందని స్థానికులు చైర్మన్ దృష్టికి తీసుకురాగా వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 19వవార్డులో డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాజేష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ క్రాంతి, మధూసూదన్, గుగులోతు శివ, లెనిన్, శ్రీను పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తుల నుంచి వ్యవసాయరంగాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి

మహబూబాబాద్ రూరల్, జూన్ 26 : కార్పొరేట్ శక్తుల కబంద హస్తాల నుంచి వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో బుధవారం ఏఐకేఎంఎస్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారాన్ని చేపట్టిన నాటి నుంచి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి ఉవ్విలూరుతున్నారని చెప్పారు. వ్యవసాయ రంగం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళితే 140 కోట్ల మంది ప్రజల ఆహార భద్రత ప్రమాదంలో పడుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య, తాజ్‌పాషా, భట్టు నాగేశ్వర్‌రావు, గుజ్జు దేవేందర్, మోకాళ్ల మురళీకృష్ణ, ఊకె పద్మ, బూర్క వెంకటయ్య పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు : డీఈవో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 26 : పాఠశాలలో ఉపాధ్యాయులందరి సమిష్టి కృషితో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం కంకరబోడు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను బుధవారం డీఈవో సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యాసంవత్సరం క్యాలెండర్ ప్రకారం నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తిచేసి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు అలసత్వం వహించవద్దన్నారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికబద్దంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులు రోజువారీగా జరుగుతున్న పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు చదువుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ ఆజాద్ చంద్రశేఖర్, హెచ్ఎం కోట్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బంది సమయం పాటించాలి

- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్


మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో బుధవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఆస్పత్రిలోని మెయిల్ సర్జికల్ వార్డు, రేడియాలజీ, క్యాజువాలిటీవార్డు, డయాలసిస్ విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రిలో వివిధ విభాగాల్లోని అవుట్ పేషేంట్, ఇన్‌పేషేంట్, ఆరోగ్యశ్రీ వార్డుల్లో ఎన్ని బెడ్స్ ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి అన్ని రకాల వ్యాధులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...అందరికి వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులకనుగుణంగా కావాల్సిన అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైద్యాధికారులు బి. వెంకట్‌రాములు, బి. జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీల అభివృద్ధికి నిబద్ధతతో పనిచేయాలి

మహబూబాబాద్,జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మునిసిపాలిటీల అభివృద్ధికి అధికారులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి మునిసిపాలిటీ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ, తొర్రూరు మునిసిపాలిటీల్లో నిర్వహిస్తున్న సివిల్ పనులలో పూర్తయినవి, పెండింగ్‌లో ఉన్నవి, ఇంకా మంజూరు అయి ప్రారంభం కానీ పనులపై అధికారులు నివేదిక ఇవ్వాలన్నారు. ఇంటి పన్నుల వసూలులో వచ్చిన నిధులను మునిసిపాలిటీ వినియోగంపై వాటి స్థితిని, గృహనిర్మాణానికి అనుమతులపై అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. ఆయా మునిసిపాలిటీల్లో నిధులు, ప్రభుత్వ గ్రాంట్‌ల ద్వార అందుతున్న నిధుల వివరాలను వాటిని ఏ పనుల కోసం వెచ్చిస్తున్నారనేది అడిగి తెలుసుకున్నారు. మునిసిపాలిటి శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. రెండ్రోజుల కొకసారి కిందిస్థాయి సిబ్బందితో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, పనుల యొక్క స్థితిగతులపై ఫీల్డ్ సూపర్‌వైజర్స్‌తో సమావేశాలునిర్వహించి పనులు వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బయోమెట్రిక్ హాజరు పక్కాగా నిర్వహించాలని సూచించారు. సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. డ్రింకింగ్ వాటర్, పారిశుద్ధ్య పనులలో నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదన్నారు. వివిధ అనుమతులకై మీసేవ ద్వార వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిశీలించాలన్నారు. ఈ సమీక్షలో మునిసిపల్ కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఈఈలు, డీఈలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

మొలకెత్తని వరి విత్తనాలు

- సేవా కేంద్రం వద్ద రైతుల ఆందోళన


మహబూబాబాద్ మండలం సింగారంలో రైతు సేవా కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు, (ఇన్‌సెట్)లో పూర్తిస్థాయిలో మొలకెత్తని వరి విత్తనాలు

మహబూబాబాద్ రూరల్, జూన్ 26 : మహబూబాబాద్ మండలం సింగారంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో ఓ కంపెనీకి చెందిన వరి విత్తనాలను రైతులు కొనుగోలు చేశారు. అవి సరిగా మొలకెత్తకపోవడంతో బుధవారం సదరు ఆగ్రోస్ సెంటర్ వద్దకు చేరుకున్న రైతులు కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు నలమాప పాపయ్య, మల్లేష్, వెంకట్రామనర్సయ్య, మహేష్‌లు మాట్లాడుతూ.. గ్రామంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో ఓ కంపెనీకి చెందిన 10 కిలోల బ్యాగు వరి విత్తనాలను కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఆ వడ్లను మండె కడితే 50 శాతం గింజలు మాత్రమే మొలకలు వచ్చాయని చెప్పారు. పూర్తిస్థాయిలో గింజలు మొలకెత్తకపోవడంతో ఆందోళన చెందిన రైతులు షాపు యాజమానిని నిలదీశారు. దీంతో కంపెనీ యాజమానులను పిలిపించి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు మరో కంపెనీకి విత్తనాలు ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. బుధవారం రైతులకు విత్తనాలు ఇస్తానని చెప్పిన కంపెనీ యాజమాని, ఆగ్రోస్ రైతు సేవాకేంద్రం యాజమాని రాలేదని చెప్పారు. ఇప్పటికైన తమను మోసం చేసి నకిలీ విత్తనాలు అంటగట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

అర్హులందరికీ గృహజ్యోతి పథకం వర్తింపు


నర్సింహులపేటలో బీఎస్ విద్యుత్ సర్వీస్‌లను పరిశీలిస్తున్న డీఈ

నర్సింహులపేట, జూన్ 26: గృహజ్యోతి పథకం అర్హులైన అందరికీ వర్తించేలా విద్యుత్ సిబ్బంది కృషి చేయాలని తొర్రూరు విద్యుత్ డీఈ మధుసూధన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. కేటగిరి-2, బీఎస్ సర్వీసులను పరిశీలించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోతో కలిసి గృహజ్యోతి అప్లికేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ తొర్రూరు డివిజన్ పరిధిలో 70,541 గృహజ్యోతి దరఖాస్తులు రాగా 33,667 గృహాలకు జీరో బిల్లు అందుతోందని, 32,009 మంది దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. నర్సింహులపేటలో 5,097 దరఖాస్తుల్లో 2,803 మందికి గృహజ్యోతిలో జీరో బిల్లు అందుతోందని, 2,693 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. 200 యునిట్ల విద్యుత్ వినియోగం చేస్తున్న వినియోగదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి జీరో బిల్లు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలంలో రైతు లు విద్యుత్ సరఫరాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఈ పాండునాయక్, మంగీలాల్ ఉన్నారు.

పంట మార్పిడి చేయాలి

జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి మరియన్న

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 26 : ఎప్పటికి ఒకే రకం పంట కాకుండా పంట మార్పిడి చేసి మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను వేసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న సూచించారు. జిల్లాలోని మహబూబాబాద్, కేసముద్రం, గూడూరు మండలాల్లోని అయిల్‌పాం తోటలను, మిర్చి నర్సరీలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. అయిల్‌పాం తోటలు సాగు చేస్తే ఎకరానికి రూ.లక్ష ఆదాయం పొందవచ్చన్నారు. అంతర్ పంటల సాగుతో అరటి, బొప్పాయి, జామ, పుచ్చకాయ, దోస, ఆకు కూరలు, కూరగాయలు, ఇతర పంటలు వేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారులు విష్ణు, అరుణ్‌తో పాటు రైతులు మూల విజయపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జినుక అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

'ఓవర్ లోడ్' వసూళ్లు!

● ఆర్టీఏ అధికారుల చేతివాటం ● ఓవర్ లోడ్ లారీ పట్టుబడితే వేలల్లో వసూళ్లు ● ఏజెంట్ ద్వారా నెలవారీ మామూళ్లు


ఇసుక లారీలు

వరంగల్ క్రైం, జూన్ 26: రవాణా శాఖలో ఓవర్ లోడ్ దందా యథేచ్ఛగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెల వారిగా ఇసుక లారీ ఒకంటికి రూ.5,500 చొప్పున తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఎదురవుతున్నాయి. శాఖ అధికారులు ఓవర్ లోడ్ పేరిట పెద్ద ఎత్తున లాగుతున్నట్లు సమాచారం. హైదరాబాద్, వరంగల్ నగరంలో పెద్ద ఎత్తున నిర్మాణాల జరుతున్నాయి. దీంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. రెండు పెద్ద నగరాలకు భద్రాచలం, కాళేశ్వరంనుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక లారీల యజమానులకు టన్నుకు రూ.600 మేరకు ఖర్చు అవుతుండగా, మార్కెట్‌లో రూ.1400కు విక్రయిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం 12 టైర్ల లారీలో 27టన్నులు, 14 టైర్ల లారీలో 32 టన్నులు, 16 టైర్ల లారీలో 36 టన్నులు మాత్రమే ఇసుక తరలించాల్సి ఉంటుంది. దీనికి మించి లారీల్లో ఇసుక తరలించకూడదు. కానీ లారీల యజమానులు ఇసుక నింపుకునే ప్రాంతంలో ఉన్నవారికి ఎంతోకొంత జేబులో పెట్టి అదనంగా నాలుగు నుంచి ఐదు టన్నులు తీసుకువస్తుంటారు. రవాణా శాఖ అధికారులు లారీల తనిఖీలు నిర్వహించి ఓవర్‌లోడ్ లారీలకు టన్నుకు రూ.5వేల చొప్పున పెనాల్టీ వేయాల్సి ఉంటుంది. కాని దీనికి భిన్నంగా అధికారులు ప్రవర్తిస్తూ లారీ సీజ్ చేస్తామనే బెదిరింపులకు గురి చేసి నోటికి వచ్చినంత వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. రూ.20వేల నుంచి 50వేల వరకు వసూలు చేస్తారనే ఆరోపణలున్నాయి.

నెలవారి మామూళ్లు తీసుకుంటున్న రవాణా శాఖ అధికారులు.. రోజువారి తనిఖీల్లో భారీగానే మూటగట్టుకుంటున్నట్లు సమాచారం. భద్రాచలం, కాళేశ్వరం నుంచి హనుమకొండకు రోజుకు 500కు పైగా లారీలు, హైదరాబాద్‌కు వెయ్యికి పైగానే వెళుతున్నట్లు తెలిసింది. 90శాతం లారీలు ఓవర్ లోడ్‌తోనే వస్తుంటాయని సమాచారం. ఈ లెక్కన రవాణా శాఖ అధికారుల సంపాదన ఏమేరకు ఉంటుందో ఊహించుకోవచ్చు.

మధ్యవర్తిగా ఒక ఏజెంట్

రవాణా శాఖలో ప్రైవేటు ఏజెంట్ల హవా కొనసాగుతుందనే విషయం తెలిసిందే. వసూళ్ల కోసం అధికారులు కొంతమంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. చేతికి మట్టి అంటకుండా ఈ ఏజెంట్లు వసూలు చేస్తారనే విమర్శలున్నాయి. వసూళ్ల కోసం వింగ్‌ల వారిగా నమ్మకమైన ప్రైవేటు ఏజెంట్లు ఉండగా, ఓవర్ లోడ్ వసూళ్లకు ఒక జెమ్ ఏజెంట్ ఉన్నట్లు తెలిసింది. ప్రతి లారీ ఓనర్ వద్ద ఏజెంట్ నంబర్ ఉన్నట్లు సమాచారం. లారీని అధికారులు పట్టుకుంటే వెంటనే యజమాని ఏజెంట్‌కు ఫోన్ చేస్తే పని చక్కదిద్దుతాడని తెలిసింది. అధికారులకు, లారీ యజమానులకు మధ్యవర్తిగా చర్చలు జరిపి లెక్క తేలుస్తాడని సమాచారం. మధ్యవర్తిగా వ్యవహరించే ఏజెంట్ పెద్దఎత్తున సంపాదించినట్లు తెలిసింది. శాఖ అధికారులకు నమ్మకమైన ఏజెంట్లలో ఈ జెమ్ ఒకరని అధికారిక సమాచారం. కొంతమంది అధికారులు వారి ప్రైవేటు డ్రైవర్లతో దందా కొనసాగిస్తున్నప్పటికీ ఏజెంట్ ప్రధాన భూమిక పోషిస్తాడనే ప్రచారం ఉంది.


ప్లాంటేషన్ పనుల వద్ద నుంచి పోడు రైతును లాక్కెళ్తున్న అటవీ సిబ్బంది

ప్లాంటేషన్ పనుల అడ్డగింత

అధికారులు, పోడు రైతుల మధ్య వాగ్వాదం

గూడూరు మండలం నాయకపల్లి, బొల్లేపల్లి అటవీప్రాంతంలో ఉద్రిక్తత

గూడూరు, జూన్ 26 : అటవీశాఖ ఆధ్వర్యంలో ప్లాంటేషన్ కోసం చేస్తున్న భూమి చదును పనులను పోడు రైతులు అడ్డుకునే ప్రయత్నం చేసిన సంఘటన గూడూరు మండలం నాయకపల్లి-బొల్లెపల్లి అటవీ ప్రాంతంలో బుధవారం జరిగింది. మూడు రోజులుగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ పనులు కొనసాగుతుండగా బుధవారం ప్లాంటేషన్‌లో నాటేందుకు మొక్కలను ట్రాక్టర్ ద్వారా తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న పోడు రైతులు ప్లాంటేషన్ పనులు జరుగుతున్న ప్రదేశానికి చేరుకున్నారు. తాము అనేక ఏళ్లుగా పోడు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఈ భూమిలో ప్లాంటేషన్ పనులు చేపడితే తమకు జీవనోపాధిపాధి ఉండదని అటవీశాఖ అధికారుల వద్ద పోడు రైతులు మొరపెట్టుకున్నారు. ఈ క్రమంలో వారు ప్లాంటేషన్‌పనులు చేపట్టవద్దని ఓ దశలో అధికారులతో వాగ్వాదానికి దిగారు. బొల్లెపల్లిలో కొంతమంది వద్ద డబ్బులు తీసుకుని సంబంధిత అధికారులు హక్కుపత్రాలు ఇచ్చారని పోడు రైతులు ఆరోపించారు. ఈ క్రమంలో వాగ్వాదానికి దిగిన పోడు రైతులను జీపు ఎక్కించేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నించడంతో ఉద్రిక్తతకు దారితీసింది.

ఏ ఒక్కరికీ హక్కుపత్రాలు లేవు :

జ్యోత్స్నదేవి, రేంజ్ అధికారి

ప్లాంటేషన్ పనులు జరిగే అటవీ భూమికి సంబంధించి ఏ ఒక్క పోడు రైతుకు హక్కుపత్రాలు లేవని మహబూబాబాద్ అటవీశాఖ రేంజ్ అధికారి జ్యోత్స్నాదేవి తెలిపారు. అక్రమ పోడు సాగును నివారిస్తామని పేర్కొన్నారు. అటవీ భూములను రక్షించి ప్లాంటేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు. హక్కుపత్రాలు ఉంటే తమకు చూపిస్తే పరిశీలిస్తామని స్పష్టం చేశారు. డబ్బులు తీసుకుని హక్కుపత్రాలు ఇచ్చేందుకు సహకరించారని నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. తగిన ఆధారాలు ఉంటే తమకు చూపించాలన్నారు. ప్లాంటేషన్ పనులకు సహకరించాలని కోరారు.

10మంది ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి

వరంగల్ క్రైం, జూన్ 26: వరంగల్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న 10మంది ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదిమందిలో ఆరుగురిని మహబూబాబాద్ జిల్లాకు, నలుగురిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయించడం జరిగింది. పదోన్నతి పొంది మహబూబాబాద్ జిల్లాకు కేటాంచబడిన వారిలో ఎండి.నజీర్, సీహెచ్.అమరేందర్‌రెడ్డి, జి.రమేశ్, ఎంకె.బేగ్, కె.సారంగపాణి, ఎస్.భీమారెడ్డి కాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు జి.భీమా, కె.సుబ్బారావు, ఎండి.యాకూబ్, పి.కొమురయ్యలను కేటాయించడం జరిగింది.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ధర్మసాగర్, జూన్ 26 : రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో కరీమ్ (30) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై రాజు బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మునిపల్లికి చెందిన కరీమ్ స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై మునిపల్లికి బయలు దేరాడు. ఈక్రమంలో కరుణాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్దకు రాగానే ఎదురుగా ద్విచక్రవాహనం వచ్చి కరీమ్ వాహనాన్ని ఢీకొనడంతో కరీమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కరీమ్ అవివాహితుడని తెలిపారు.

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణను కలిసిన రాకేష్‌రెడ్డి



రాంనగర్, జూన్ 26: సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణను బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్‌లో లక్ష్మీనారాయణను కలిసిన రాకేష్‌రెడ్డి.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గెలుపు, ఓటమిలతో సంబంధం లేదని రాజకీయాల్లో ఆదర్శంగా నిలవాలని, విద్యావంతులు, నిజాయితీపరులు రాజకీయాల్లోకి రావాలని ఆయన తెలిపినట్లు రాకేష్‌రెడ్డి తెలిపారు.

నేటి నుంచి వచ్చేనెల 6 వరకు పలు రైళ్ల రద్దు

కాజీపేట, జూన్ 26: కాజీపేట- బల్లార్ష సెక్షన్‌లో అసిఫాబాద్ - రెచ్నీ స్టేషన్‌ల మధ్య మూడోలైను నిర్మాణం కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (12757) సికింద్రాబాద్ - సిర్పూర్ కాగజ్‌నగర్‌ల మధ్య నడిచే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు అప్ అండ్ డౌన్ ఈ నెల 27 నుంచి జూలై 6 వరకు రద్దు చేశారు. (22151) పూణే - కాజీపేట మధ్య నడిచే పూణే ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ ఈ నెల 28 నుంచి జూలై 5 వరకు రద్దు చేశారు. (12724) న్యూఢిల్లీ నుంచి సికింద్రాబాద్‌ల మధ్య నడిచే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ జూన్ 27 నుంచి జులై 6 వరకు సికింద్రాబాద్ కాజీపేట జంక్షన్‌ల మధ్య మాత్రమే నడిపించనున్నారు. ఇదే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ జూలై 3, 4, 5, తేదీలలో ముద్ఖేడ్, నిజామాబాద్ మీదుగా దారిమళ్లించి నడిపించనున్నారు. బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, కాజీపేట జంక్షన్‌ల మీదుగా రద్దు చేశారు.

ఎంజీఎంలో విద్యుత్ అంతరాయంతో మా శాఖకు సంబంధం లేదు: ఎస్ఈ

హనుమకొండటౌన్, జూన్ 26: ఎంజీఎంలో తరుచుగా జరుగుతున్న విద్యుత్ అంతరాయంతో విద్యుత్‌శాఖకు ఎలాంటి సంబంధం లేదని వరంగల్ ఎస్ఈ మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న అంతర్గత కేబుళ్లలో వచ్చే సమస్యలతో అంతరాయం ఏర్పడుతోందని, విద్యుత్‌శాఖ సబ్ స్టేషన్ నుంచి నిరంతరాయంగా ఎంజీఎంకు విద్యుత్ సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. 24గంటల పాటు విద్యుత్‌శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నారని తెలిపారు.

త్వరలోనే జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ నియామకాలు

హనుమకొండ టౌన్, జూన్ 26: గత సంవత్సరం జూన్‌లో నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాల నియామక ప్రక్రియను త్వరలోనే చేపట్టనున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ జాయింట్ సెక్రెటరీ కె.రమేశ్ తెలిపారు. 100 పోస్టులకు రాత పరీక్ష నిర్వహించి నియామకాలు చేపడుతున్న సమయంలో ఆరుగురు అభ్యర్థులు నోటిఫికేషన్‌పై హైకోర్టును ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వులు తీసుకురాడంతో పోస్టుల భర్తీ మధ్యలోనే నిలిచిపోయిందన్నారు. మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం ఆరు పోస్టులను పిటిషనర్ సంబంధిత సర్కిల్‌లో, ఖాళీ లేకపోతే పక్క సర్కిల్‌లో రిజర్వు చేసి తాత్కాలికంగా ఆరు పోస్టుల నియామక ప్రక్రియను నిలిపివేసి, మిగతా 94 పోస్టుల నియామక ప్రక్రియను పూర్తి చేయడానికి ఎన్పీడీసీఎల్ నిర్ణయం తీసుకుందని, త్వరలోనే నియామక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

త్వరలో ఐటీ పార్క్‌లో మా కంపెనీ ప్రారంభిస్తాం..

వరంగల్ క్రైం, జూన్ 26: త్వరలో మడికొండ ఐటీ పార్క్‌లో కంపెనీని ప్రారంభిస్తామని ఎథిరాం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వాహకుడు అరుణ్ కుమార్ రాపోలు ఒక ప్రకటనలో తెలిపారు. తమకు కేటాయించిన స్థలంలో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కొంతమంది తన ఎదుగుదలను ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగాలు ఇస్తానని, కంపెనీలో షేర్ ఇస్తానని తాను ఎవరినీ మోసం చేయలేదన్నారు. తాను ఎవరికీ డబ్బులు ఇచ్చేది లేదన్నారు. తాను తప్పు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. తాను ఎక్కడికి పారిపోలేదని, కంపెనీ పనులు చేసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికైనా తనపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆపాలని అరుణ్‌కుమార్ సూచించారు.

జాతీయ ఎస్టీ కమిషన్ ఎదుట కేయూ రిజిస్ట్రార్ హాజరు

కేయూ క్యాంపస్, జూన్ 26: కాకతీయ యూనివర్సిటీ ఉన్నతాధికారులకు ఇచ్చిన నోటీసుల మేరకు గురువారం న్యూఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్ ఎదుట కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి హాజరయ్యారు. తనకు ప్రమోషన్లు ఇవ్వడం లేదని, అలాగే అడ్మినిస్ట్రేటివ్ పదవులు ఇవ్వకుండా దాటవేస్తున్నారని ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ జాతీయ ఎస్టీ కమీషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషన్ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్‌ను హాజరుకావాలని నోటీసులు జారీ చేసింది. దీంతో వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ హాజరయ్యారు.

గురుకుల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

- సర్కార్‌కు వారి బాధలు కనిపించట్లేదా?: హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. సీఎం ఇంటి ముందు మోకాళ్ల మీద నిలబడి అభ్యర్థించినా గురుకుల అభ్యర్థుల మొర ఆలకించకపోవడం శోచనీయమన్నారు. బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా గురుకుల అభ్యర్థుల నిరసనకు మద్దతు ప్రకటించారు. వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అన్నింటినీ భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు జీవో46ను సవరించాలని బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీవో46కు సంబధించిన కేసు విచారణను అడ్వకేట్ జనరల్ ఉద్దేశపూర్వకంగా వాయిదా వేయించారని ఆరోపించారు.

కేసీఆర్ భూముల కోసమే అలైన్‌మెంట్ మార్చారు

- 'ఆర్ఆర్ఆర్' భూనిర్వాసితుల ఐక్య వేదిక

గజ్వేల్, జూన్ 26: తన భూముల విలువ పెంచుకునేందుకే మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చారని భూనిర్వాసితుల ఐక్య వేదిక నేతలు మండిపడ్డారు. ఈ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనంటూ వారు డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే తమ భూముల నుంచి కొండపోచమ్మ సాగర్ కాలువలు వెళ్లాయని వెళ్లాయని, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తే.. ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు ఆర్డీవో ఎకరాకు రూ.7.50లక్షలు మాత్రమే ఇస్తామంటున్నారని, ఆ డబ్బుతో ఏం వస్తుందని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసినప్పుడు తమకు న్యాయం చేస్తామన్నారని, ఇప్పుడు టెండర్లను పిలుస్తున్నట్లు ప్రకటించడం సరికాదని ఆక్షేపించారు. ఇప్పటికే ఉన్న చిట్యాల-సంగారెడ్డి 161 జాతీయ రహదారినే రీజినల్ రింగ్ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీకి షరతులు..వెన్నుపోటే: కిసాన్‌మోర్చా

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రారంభ, ముగింపు తేదీలు అంటూ షరతులు విధించడం.. రైతులకు వెన్నుపోటు పొడవడమేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీపై తుక్కుగూడ సభలో రాహుల్ గాంధీతో హామీ ఇప్పించారని, దాన్ని అమలు చేయకపోతే ప్రజలే ఆ పార్టీ నేతల తుక్కు రేగ్గొడతారని హెచ్చరించారు. ఖరీఫ్‌లో పెట్టుబడికి డబ్బులు లేక రైతులు అల్లాడుతుంటే... అభిప్రాయ సేకరణ అంటూ ఆటలాడుతున్నారని మండిపడ్డారు. షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని, లేదంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

పెన్షనర్ల సమస్యలపై ఉద్యమిస్తాం: జేఏసీ

సమస్యల పరిష్కారం కోసం జూలై నుంచి ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం సీఎస్‌కు నోటీసు అందజేసినట్లు జేఏసీ చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి శుభాకర్‌రావు తెలిపారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు జూలై 15న అన్ని జిల్లా కేంద్రాల్లో సమావేశాలు పెట్టి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామని వెల్లడించారు. వేలాది మంది పెన్షనర్లతో జూలై 30న ఇందిరాపార్కు వద్ద మౌనదీక్ష చేస్తామని తెలిపారు.

అవినీతికి పాల్పడలేదని పొన్నం చెప్పగలరా?

- మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నాం
- బీఆర్ఎస్ మళ్లీ వచ్చాక ఎవర్నీ వదిలిపెట్టం: కౌశిక్‌రెడ్డి

బంజారాహిల్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ దేవుడిపై ప్రమాణం చేస్తారా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. ఆయన ప్రమాణం చేస్తే క్షమాపణ చెప్పేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఫ్లై యాష్ తరలింపులో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.100 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించిన కౌశిక్‌రెడ్డి.. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయానికి వస్తే నిరూపిస్తానని సవాల్ విసిరారు. ఈ మేరకు బుధవారం టీటీడీ ఆలయానికి వచ్చిన కౌశిక్‌రెడ్డి.. అక్కడ మీడియాతో మాట్లాడారు. తన ఆరోపణలపై మంత్రి పొన్నం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లీగల్ నోటీసులు పంపిస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. ఫ్లై యాష్ లారీలను తానే స్వయంగా హుజురాబాద్‌లో పట్టుకున్నానని, వే బ్రిడ్జికి తరలించి తూకం వేస్తే 76 టన్నులు పైగా తీసుకెళ్తున్నట్లు తేలిందన్నారు. నిబంధనల ప్రకారం 16 టైర్ల లారీలో 36 టన్నులు మాత్రమే తీసుకువెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యవహారంలో రవాణా శాఖ మంత్రికి సంబంధం లేదా?అని ప్రశ్నించారు. మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నట్టు, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలేది లేదని హెచ్చరించారు.



ప్రధాని మోదీని కలిసిన బండారు దత్తాత్రేయ, కుటుంబ సభ్యులు

మోదీకి గవర్నర్ దత్తాత్రేయ అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీకి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందనలు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీని దత్తాత్రేయ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణభగవానుని 'విరాట్ స్వరూప్' విగ్రహాన్ని ప్రధానికి బహూకరించారు. గవర్నర్ సతీమణి బండారు వసంత, కుమార్తె బండారు విజయలక్ష్మి, అల్లుడు, డాక్టర్ బి.జిగ్నేష్ రెడ్డి, బండారు శివశంకర్, మనవరాళ్లు యశోధర రెడ్డి, వేదాంషి రెడ్డిలు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. యశోధర, వేదాంషి ప్రధాని కోసం రెండు పాటలు పాడగా.. మోదీ వారిని ప్రత్యేకంగా అభినందించి, ఆశీర్వదించారు. మరోవైపు.. ప్రధానిమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి కలిశారు.

మేడిగడ్డ డిజైన్ ఒకటైతే..నిర్మాణం మరోరకంగా

- తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలించాలి: కోదండరాం

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టు డిజైన్ ఒకటైతే నిర్మాణం మరోరకంగా చేశారని, అందుకే అది కుంగిందని టీజేఎస్ అధినేత కోదండరాం అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత లేదని, నిర్వహణ కూడా సరిగా లేదని ఆరోపించారు. ఈ విషయాలను డ్యామ్ సేఫ్టీ అధికారులే వెల్లడించారని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సుజల స్రవంతి పేరుతో కాంగ్రెస్ హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద చేపట్టిన ప్రాజెక్టుకు సంబంధించి రూ.800కోట్ల ఖర్చుతో కాల్వల నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలన చేసి కొంతమేరకు పనులు చేసినట్లయితే.. అప్పుడు చేపట్టిన కాల్వల ద్వారా నీటిని తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. మేడిగడ్డ తప్పిదానికి బాధ్యులపై చర్యలు తీసుకుని శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి విచారణ కమిషన్ వేయాలని అడిగిందే బీఆర్ఎస్ వాళ్లన్నారు. ఇప్పుడు కమిషన్‌కు అర్హత లేదని చెప్పి.. వాస్తవాలు తెలియకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైల్‌రోకో కేసులో కేసీఆర్‌తో పాటు తానూ ఉన్నానని గుర్తు చేసిన కోదండరాం.. ఉద్యమకారులందరిపై కేసులు తొలగించాలని కోరాల్సింది పోయి.. ఆయనపైన ఉన్న కేసులే తొలగించాలనడం విడ్డూరమన్నారు.

స్పీకర్.. అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు

- మెయిల్, స్పీడ్ పోస్టులో ఫిర్యాదులు పంపాం
- పోచారం, సంజయ్‌ను అనర్హులుగా ప్రకటించాలి
- ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పడం సిగ్గుచేటు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ తరఫున గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం చట్ట వ్యతిరేకమని, వారిని అనర్హులుగా ప్రకటించాలని ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేద్దామంటే ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆ ఇద్దరిపై అనర్హత వేటువేయాలని కోరుతూ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శికి వేర్వేరుగా ఈ మెయిల్, స్పీడ్ పోస్టు ద్వారా ఫిర్యాదులు పంపామన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారిద్దరిపై స్పీకర్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు. పాంచ్‌న్యాయ్‌లో ఫిరాయింపులను ఆమోదించబోమని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో చట్టప్రకారం రెండు వంతుల మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరారని గుర్తు చేశారు. తమ పార్టీలో చేరిన వారంతా కేసీఆర్ వద్దకు వచ్చి కండువాలు కప్పుకొన్నారని, కానీ.. ఇప్పుడు రేవంత్ ఇంటింటికి తిరిగి కండువాలు కప్పడం సిగ్గుచేటన్నారు.

ఫిరాయింపులపై కేటీఆర్ మొసలి కన్నీరు

- త్వరలోనే బీఆర్ఎస్ నుంచి మరిన్ని చేరికలు: విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. గతంలో టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రిని చేసినప్పుడు కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటు పోయిందో కేటీఆర్ చెప్పాలన్నారు. సీఎల్పీ మీడియా హాల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కేసీఆర్.. తన ఫామ్ హౌస్‌లో వీడ్కోలు పార్టీ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ మునుగుతున్న నావ అని, రేవంత్‌రెడ్డి అనే తుఫానులో ఆ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలను హీనాతి హీనంగా చూసిన చరిత్ర కేసీఆర్‌ది అని ధ్వజమెత్తారు. త్వరలోనే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మరిన్ని చేరికలుంటాయని స్పష్టం చేశారు. ఆ పార్టీలో మిగిలేది నలుగురేనన్నారు. కాగా, దివ్యాంగులకు ఉన్నత విద్యలో 5శాతం రిజర్వేషన్ కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి.. వారి ఆత్మబంధువుగా మారారని టీపీసీసీ దివ్యాంగుల సెల్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కొనియాడారు.

మెట్టు దిగిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాంగ్రెస్సే ముఖ్యమని వెల్లడి.. కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీతో భేటీ

- ఫలించిన అధిష్ఠానం బుజ్జగింపులు
- కాంగ్రెస్‌తోనే జాతి ఐక్యత: జీవన్ రెడ్డి
- పార్టీలో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం: దీపాదాస్ మున్షీ



ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వీడడం ఖాయమన్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. తనకు సమాచారం ఇవ్వకుండానే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని తీవ్ర మనస్తాపం చెందిన జీవన్‌రెడ్డి ఎట్టకేలకు మెట్టు దిగారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవాళ్ల అభిప్రాయాల ఆధారంగానే చేరికలు, ఇతర విషయాలలో ముందుకెళతామని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. రంగంలోకి దిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పరిస్థితిని చక్కబెట్టారు. మూడ్రోజులుగా అసంతృప్తితో రగిలిపోతూ పార్టీని వీడేందుకు సిద్ధపడిన జీవన్‌రెడ్డికి పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీ రావాలని కోరడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం జీవన్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో జీవన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అరగంటపాటు చర్చలు జరిపారు. అయినా జీవన్‌రెడ్డి వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి కేసీ వేణుగోపాల్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్లినా తాను పార్టీని నమ్ముకుని ఉన్నానని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. జీవన్‌రెడ్డిని బుజ్జగించిన పెద్దలు.. పార్టీ అండగా ఉంటుందని, దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటున్న సమయంలో పార్టీని వీడవద్దని కోరినట్లు తెలిసింది. దీంతో చల్లబడిన జీవన్‌రెడ్డి సమ్మతించారు. భేటీ అనంతరం బయటికి వచ్చాక జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనకు కాంగ్రెస్సే ముఖ్యమంటూ వెల్లడించారు. కార్యకర్తలను కాపాడుకోవడం ఏ పార్టీకైనా ముఖ్యమని అన్నారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఆలోచనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, జాతి ఐక్యతను కాంగ్రెస్ కాపాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలుకాని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీకి కాంగ్రెస్ సంకల్పించదని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడటమా?: దుద్దిళ్ల

పార్టీలో సీనియర్ నేత అయిన జీవన్‌రెడ్డిని కించపరచడం తమ ఉద్దేశ్యం కాదని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే చేరికను అగౌరవంగా, అమర్యాదగా భావించి ఉండవచ్చన్నారు. పార్టీలో చేరికలకు తలుపులు తెరిచే ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం తగ్గకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా కేసీ వేణుగోపాల్‌తో చర్చించే తీసుకుంటామని చెప్పారు. మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ.. టీపీసీసీ అధ్యక్ష పదవిపై నిర్ణయం అధిష్ఠానానిదేనని ఆమె పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతల విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఫిరాయింపులపై ప్రశ్నించేందుకు ఆ పార్టీకి కాస్త అయినా నైతికత ఉండాలని మండిపడ్డారు. అధికారంలో ఉండగా కాంగ్రెస్‌ను అంతం చేయాలని ప్రయత్నించారన్నారు. ఇపుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మార్పు ఎలా ఉందో స్పష్టంగా కనపడుతోందని ఆయన పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్తు అంధకారం

- యువత వ్యసనాలు వీడి ఉన్నత లక్ష్యాలు చేరాలి: జూపల్లి
- మాదక ద్రవ్యాల మత్తులోనే లైంగిక దాడులు, హత్యలు: సీతక్క

మాదాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు బానిసైతే ఉజ్వల భవిష్యత్తు అంధకారమవుతుందని, యువత వ్యసనాలను వీడి లక్ష్యం వైపు అడుగులేసి ఉన్నత స్థాయికి చేరుకుని భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన 'డ్రగ్స్ నియంత్రణ.. అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. మానవ జన్మ ఎంతో ఉత్తమమైనదని.. కానీ చెడు వ్యసనాల కారణంగా అనారోగ్యం పాలైన చాలామంది అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచానికి ఉగ్రవాదం తర్వాత అంతటి పెనుసవాలుగా డ్రగ్స్ వినియోగం మారిందన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు కూడా డ్రగ్స్ చేరడం ఆందోళన కలిగించే విషయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎంతో డ్రగ్ పెడర్లతో పాటు వినియోగిస్తున్న వారినీ అదుపులోకి తీసుకుని కేసులు పెట్టామని వెల్లడించారు. సీతక్క మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల మాఫియా ప్రపంచాన్ని గడగడలాడించి, కోట్లు కొల్లగొడుతోందన్నారు. మాదకద్రవ్యాల మత్తులో లైంగిక దాడులు, హత్యలు చేస్తున్నారని, పెద్దపల్లిలో చిన్నారిపై లైంగికదాడి హత్య ఘటన మనసును కలవరపెట్టిందన్నారు. డ్రగ్స్ అనర్థాలపై మెగాస్టార్ చిరంజీవి సందేశంతో కూడిన వీడియో, పాటను మంత్రులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా, మాజీ క్రికెటర్ మిథాలీరాజ్, సినీ నటులు సుమన్, తేజా సజ్జా, గాయకుడు రామ్ మిరియాల, అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐఆర్ మంజూరు చేసే వరకు మాట్లాడుతూనే ఉంటా

- కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కలుస్తా
- ప్రతిపక్షంగా మా బాధ్యత మేము నిర్వహిస్తాం
- కాంగ్రెస్ ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు.. రఘునందన్ రావు బీఆర్ఎస్‌లో ఉన్నడు
- నాకష్టంతోనే నేను ఎదిగా: తూర్పు జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను మంజూరు చేసే వరకూ దానిపై మాట్లాడుతూనే ఉంటానని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంటు సమావేశాలు అయిపోయిన తర్వాత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం ఇస్తానని, రద్దయిన ఐటీఐఆర్‌ను తిరిగి తీసుకురావాలని కోరతానని వెల్లడించారు. ప్రతిపక్షం తరఫున తమ బాధ్యత నిర్వర్తిస్తామని వెల్లడించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు కాంగ్రెస్‌కు వచ్చుంటే.. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేందుకు అవకాశం ఉండేదేమోనన్నారు. అప్పుడు తామంతా రాహుల్ దగ్గర కూర్చుని హైదరాబాద్‌కు తిరిగి ఐటీఐఆర్‌ను మంజూరు చేయించుకుని ఉండేవాళ్లమని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సోనియా, మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ఐటీఐఆర్‌ను మోదీ ప్రభుత్వం రద్దు చేయకుండా ఉంటే రాష్ట్రంలోని యువతకు ఈ పదేళ్లలో సుమారు 15లక్షల ఉద్యోగాలు వచ్చుండేవన్నారు. ఆ ప్రాజెక్టు అమలై ఉంటే సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, ట్రేడ్, వేర్ హౌస్ జోన్లు, ఎక్స్‌పోర్టు ఓరియెంటెడ్ యూనిట్లు హైదరాబాద్‌లో విస్తరించి ఉండేవని పేర్కొన్నారు. ప్రభుత్వానికీ పెద్ద ఎత్తున ఆదాయం సమకూరి ఉండేదన్నారు. ఇంత గొప్ప ప్రాజెక్టును ఎన్డీయే ప్రభుత్వం నిలిపేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన 8మంది బీజేపీ ఎంపీలు ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఐటీఐఆర్‌ను తిరిగి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

నా కష్టంమీ్మద నేను ఎదిగా

"ఐటీఐఆర్ గురించి నాకు అఆలు కూడా తెలియవని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అంటున్నారు. ఎడ్యుకేషన్‌పరంగా నేను వీక్ అయుండొచ్చు. ఇంటర్ ఫెయిల్ అయ్యాను కూడా. రఘునందన్‌రావు పుస్తకాలు చదివితే.. నేను జీవితాన్ని చదివిన. పుస్తకాల్లో ఎవరో రాసింది ఉంటది. మెరిట్ స్టూడెంట్‌కు అనుభవాలు ఉండవు. జీవితాన్ని చదివిన వాడికి కష్టాలు, అనుభవాలు ఉంటయి" అని జగ్గారెడ్డి అన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిండంటూ తనపై రఘునందన్‌రావు విమర్శలు చేస్తుండని, కానీ ఇక్కడ తల్లి పాత్రే తనదన్న సంగతి ఆయన తెలుసుకోవాలన్నారు. తన చిన్నతనంలో తమ దగ్గర ఆరెస్సెస్ శాఖలు నడుస్తుంటే.. పిల్లలమైన తాము గంట సేపు ఆడుకుని ప్రచారక్‌లు ఏదో చెబితే విని వస్తుండేవాళ్లమని చెప్పారు. రఘునందన్‌రావు బీజేపీలోకి డైరెక్టుగా వచ్చిండు కాబట్టి ఆ శాఖల గురించి ఆయనకు తెలియదన్నారు. ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు ఆయన బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. తన కష్టం మీద, తన తల్లి ప్రోత్సాహంతో తాను ఎదిగానని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి జైలుకూ వెళ్లానన్నారు. తన జోలికి వస్తే బీజేపీలో ఉండే కుళ్లు, కుతంత్రాలు చర్చకు పెడతానని హెచ్చరించారు.

ప్రాణాలు తీస్తున్న మద్యం

- 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు
- ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం పానం ప్రజారోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో మరణాలకు కారణమవుతోంది. 'గ్లోబల్ స్టేటస్ రిపోర్టు ఆన్ ఆల్కహాల్ అండ్ హెల్త్ అండ్ ట్రీట్మెంట్ ఆఫ్ సబ్‌స్టాన్స్ యూజ్ డిజార్డర్' పేరిట ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మద్యం వినియోగానికి సంబంధించి 2019 నాటికి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా డబ్ల్యూహెచ్‌వో ఈ నివేదిక రూపొందించింది. దీని ప్రకారం 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మంది ఆల్కహాల్, మాదక ద్రవ్యాల వినియోగ రుగ్మతతో జీవిస్తున్నారు. వీరిలో 20.9కోట్ల మంది మందుబాబులు ఉన్నారు. మద్యపానం వల్ల కలిగే అనారోగ్యాల వల్ల 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు సంభవించాయి. మొత్తం మృతుల్లో 20 లక్షల మంది పురుషులే ఉండడం గమనార్హం. అంతేకాక, మరణించిన వారిలో 20-39 ఏళ్ల లోపు వారే అత్యధికంగా ఉన్నారు. భారత్ విషయానికొస్తే 2019 నాటికి దేశ జనాభాలో 31 శాతం మంది మద్యపానం చేసే వారున్నారు. దేశంలోని పురుషుల్లో 40.9 శాతం మంది, మహిళల్లో 20.8 శాతం మంది మద్యపానం చేసేవారున్నారు. మద్యపానం వల్ల మరణించిన వారి సంఖ్యలోనైతే భారత్ ఏకంగా చైనాను అధిగమించింది. భారత్‌లోని ప్రతీ లక్ష మంది జనాభాలో 38 మంది మద్యం వల్ల మరణిస్తే చైనాలో ఈ సంఖ్య కేవలం 16గా ఉంది. కాగా, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచవ్యాప్తంగా 2.98 లక్షల మంది మృత్యువాత పడ్డారు. కాగా, 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా తలసరి మద్యం వినియోగం 5.5 లీటర్లు(ఏడాదికి ఒక వ్యక్తి తాగే మద్యం)గా ఉంది. భారత్‌లో ఇది 4.9 లీటర్లుగా ఉండగా 2030 నాటికి అది 6.7 లీటర్లకు చేరనుందని డబ్ల్యూహెచ్‌వో అంచనా వేసింది.

మహిపాల్‌రెడ్డి చూపు.. బీజేపీ వైపు?

కమలం గూటికి చేరనున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే?

- ఈడీ తనిఖీలతో ఆందోళనలో బీఆర్ఎస్ నేత?
- ఢిల్లీకి రహస్య టూర్



పటాన్‌చెరు, జూన్ 26: బీఆర్ఎస్‌కు మరో షాక్ తగలనుందా? పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బీజేపీలో చేరుతారా? ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జరిపిన తనిఖీల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చారా? అంటే.. మహిపాల్‌రెడ్డి ఆకస్మికంగా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో ఈ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం జహీరాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డి సమావేశం కావడం కూడా ఆయన బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. అయితే గతంలో బీఆర్ఎస్ తరఫున రెండుసార్లు జహీరాబాద్ ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డికి సన్నిహిత సబంధాలున్నందున.. ఆ చనువుతో ఆయనను కలిశారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కానీ, గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు పటాన్‌చెరు నియోజకవర్గంలో లక్ష పైచిలుకు ఓట్లు సాధించడంతో.. ఓటుబ్యాంకు బీజేపీ వైపు మళ్లిందన్న సంకేతాలు కనిపించాయి. బీఆర్ఎస్ ఏకంగా మూడో స్థానానికి పడిపోవడంతో తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న స్థానిక బీఆర్ఎస్ నేతల మెదళ్లను తొలుస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే ఫలితాలు వస్తే కేడర్ మిగలదన్న భావన వ్యక్తమవుతోంది. అయితే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగినా.. ఈడీ సోదాల తరువాత పరిణామాలు వేగంగా మారిపోయాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో తన ప్రధాన అనుచరులుగా చెప్పుకొనే వారికి సైతం చెప్పకుండా ఆయన ఢిల్లీకి వెళ్లారు. కేవలం కేసు పనిమీద న్యాయవాదులను కలిసేందుకు వెళ్లినట్లు ఆయన అనుచరులు చెబుతున్నా.. బీజేపీ నేత బీబీ పాటిల్‌తో మంతనాలకు సంబంధించి మాత్రం సమాధానం కరువైంది. అంతేకాకుండా బీజేపీ సంగారెడ్డి జిల్లా ముఖ్యనాయకుడు సైతం ఎమ్మెల్యే వెంట వెళ్లడం అనుమానాలు మరింత బలపడేలా చేస్తోంది.

కాంగ్రెస్ చేరేందుకు స్థానికంగా వ్యతిరేకత

మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరేందుకే ప్రయత్నాలు చేశారని, కానీ.. ఆయన ప్రయత్నాలను స్థానిక కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారని సమాచారం. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన నీలం మధు ముదిరాజ్.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికను వ్యతిరేకించినట్లు తెలిసింది. మరోవైపు మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు ఇటీవల తనిఖీ చేసి పెద్ద ఎత్తున స్థిరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతోపాటు బినామీలుగా భావిస్తున్న కొందరిని ఈడీ కార్యాలయానికి పిలిపించి అక్రమాస్తులపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ బిల్డర్ మధుసూదన్‌రెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నట్లు ఆధారాలు లభ్యం కావడంతో ఆయన నుంచి వివరణ అడిగారు. మిగతా బినామీ వ్యక్తులు ఈడీ నుంచి తప్పించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారని తెలిసింది. ఎవరికి ఎప్పుడు ఈడీ నుంచి పిలుపు వస్తుందో, ఎవరి ఇళ్లలో సోదాలు చేస్తారోనన్న భయంతో వారు బిక్కుబిక్కుమంటున్నారు.

6 నెలల్లో అన్నీ తారుమారవుతాయి

(మొదటి పేజీ తరువాయి)

చూస్తున్నారన్న మాటలు కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో ఆయన కేసీఆర్‌ను కలవడంతో ఆ ఊహాగానాలకు తెరపడినట్టేనని కొందరు భావిస్తుండగా, మరికొందరు నాయకులు మాత్రం పార్టీ మారే అవకాశాలను కొట్టిపారేయలేమని వాదిస్తున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను కలిసి చర్చలు జరిపినప్పుడు మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఉన్నట్లు సమాచారం. లక్ష్మారెడ్డి వెంట నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. నాయకులందరూ కేసీఆర్‌తో ఫొటోలు దిగిన అనంతరం అక్కడే భోజనాలు చేశారు. ఆయనను కలిసిన వారిలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతామధు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. వారితో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దాదాపు ఐదు గంటల పాటు కేసీఆర్ ఫాంహౌస్‌కు వచ్చిన కార్యకర్తలను కలిశారు.

మత్తులో పడి యువత చిత్తు కావొద్దు


మాట్లాడుతున్న జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సురేష్


తొర్రూరు సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి మట్ట సరిత


మహబూబాబాద్ ర్యాలీలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ, అధికారులు


మదర్‌థెరిస్సా సెంటర్‌లో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న కాళోజీవాకర్స్ అసోసియేషన్ బాధ్యులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 26 :గంజాయి మత్తులో పడి యువత బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఫారెస్టు సెంటర్‌లో జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ పట్టణ పురవీధుల గుండా కొనసాగుతూ.. తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మత్తు పదార్థాల నియంత్రణే లక్ష్యంగా మహబూబాబాద్ జిల్లా పోలీసులు ముందుకు సాగుతున్నారని చెప్పారు. మత్తు విక్రయాల సమాచారం తెలిస్తే డయల్ 100 లేదా సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు, డీసీఆర్బీ వర్టికల్స్ డీఎస్పీ మోహన్, ఏఆర్‌డీఎస్పీలు శ్రీనివాస్, విజయ్‌ప్రతాప్, సీఐలు దేవేందర్ పాల్గొన్నారు.

● మహబూబాబాద్ మదర్‌థెరిస్సా సెంటర్‌లో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులచే మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక, అడిషన ల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, డీఈవో రామారావు, అప్పారావు, హెచ్ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● మహబూబాబాద్ పట్టణంలోని కురవి గేట్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ తీసుకోవద్దన్నారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పొ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాదావత్ కిరణ్‌నాయక్, వివిధ శాఖల అధికారులు వరలక్ష్మి, అంబరీష, రామారావు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

● కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌నుంచి మదర్‌థెరిస్సా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ సలహాదారులు మైస శ్రీనివాస్, నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, కున్సోత్ హట్యానాయక్, విష్ణువర్ధన్, నాగేశ్వర్‌రావు,రాజన్న, వెంకటేశ్వర్లు పరమేశ్వర్, పాల్గొన్నారు.

● మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి పీహెచ్‌సీలో డ్రగ్స్ నిర్మూలనపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, సీహెచ్‌వో దండె శ్రీహరి, భద్రమ్మ, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

● తొర్రూరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ/ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ జడ్జి మట్ట సరిత హాజరై మాట్లాడారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.ప్రవీన్‌రాజు, ఎంఈవో రాములు, ఎంఎస్‌వో బుచ్చయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

● కొత్తగూడ మండల పొగుళ్లపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు డ్రగ్స్ నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు నెల్లుట్ల భాస్కర్, జుమ్మలాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

● గూడూరు మండల కేంద్రంలో విద్యార్థులచే డ్రగ్స్ నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరస్వామి, ఎంపీటీసీ కత్తిస్వామి, ఎంఎస్‌వో రవికుమార్, సుజాత, సదాశివ, హరిశంకర్, శ్రీనివాస్, సునీత, శరత్‌బాబు, శ్రీధర్, అనిల్‌కుమార్, మహబూబ్‌అలీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● కేసముద్రం స్టేషన్ హైస్కూల్ హెచ్ఎం బి.రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

● నెల్లికుదురు మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, మధు, భాస్కర్, ఐలయ్య, జనార్ధన్, షహనాజ్‌బేగం పాల్గొన్నారు.

● కురవిలో బలపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి పాల్గొన్నారు. అనంతరం గిరిజన బాలికల వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

● పెద్దవంగరలో ఎంపీపీ ఎర్ర సబిత, జట్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గంజాయిపైఅవగాహన కల్పించారు. ఎంహెచ్‌పీ మహేందర్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ ఉమ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం కేటాయించాలి

తొర్రూరు, జూన్ 26: పట్టణంలో నిరుపేదలకు డబుల్ బెడ్‌రూంలు కేటాయించాలని బుధవారం సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో ఆర్డీవో నర్సింహారావుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆపార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి మాట్లాడుతూ తొర్రూరు పట్టణంలో గత ప్రభుత్వం సుమారు 400 ఇండ్లు నిర్మించి లబ్ధిదారులకు అందించలేదని అవి ప్రస్తుతం వృథాగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, రామస్వామి, మధు, షరీఫ్, వెంకన్న, శేఖర్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టాన్ని తేవాలి

తొర్రూరు, జూన్ 26: వ్యవసాయ రంగంపై ఆధారపడిన కూలీలకు సమగ్ర చట్టం తేవాలని కోరుతూ ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం తొర్రూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వీరన్న మాట్లాడారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ నర్సయ్యకు వినతిపత్రం అందించారు. యాకయ్య, వెంకటయ్య, కొమురయ్య, వెంకన్న, షరీఫ్ పాల్గొన్నారు.

జిల్లాలో ఓ మోస్తరు వర్షం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 26 :జిల్లాలో బుధవారం ఉదయం మండు టెండలు కొట్టగా సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఆకాశంలో మబ్బులు కమ్ముకుని వాతావరణం చల్లబడడంతో ప్రజలకు ఉపశమనం కలిగింది. కేసముద్రం, నెల్లికుదురు, పెద్దవంగర, తొర్రూరు, గూడూరు మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురియగా డోర్నకల్, గార్ల, మహబూబాబాద్ మండలాల్లో చినుకులు పడ్డాయి.

చెరువు భూముల సర్వే చేపట్టాలి

తొర్రూరు, జూన్ 26: జిల్లాలోని మేజర్ మునిసిపాలిటీ తొర్రూరు పెద్దచెరువు శిఖం భూములను సర్వే చేపట్టాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మాలోత్ సురేష్ బాబు బుధవారం జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొకు వినతిపత్రం అందించారు. తక్షణమే ఎమ్మెల్యే స్పందించి డిజిటల్ సర్వేకు ఆదేశించాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు శరత్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పాత పద్ధతిలోనే అంగడి నిర్వహణ జరగాలి

గూడూరు, జూన్ 26 : గూడూరు మండల కేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే అంగడిని పాత పద్ధతిలోనే నిర్వహించాలని అంగడి చిరువ్యాపారులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గూడూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో వీరస్వామికి వినతిపత్రం అందజేశారు. గూడూరు ఎంపీటీసీ కత్తిస్వామి, గూడూరు-2 ఎంపీటీసీ నూకల రాధిక సురేందర్‌లు సైతం చిరువ్యాపారులకు మద్దతునిచ్చారు.

రిజర్వేషన్ల మూలపురుషుడు సాహుమహరాజ్


సాహు మహరాజ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 26 : భారత దేశంలో రిజర్వేషన్ల మూల పురుషుడు సాహుమహరాజ్ అని ఎస్సీ, ఎస్టీ ఉగ్యోగుల అసోసియేషన్ సభ్యులు పార్నంది రామయ్య అన్నారు. మహబూబాబాద్‌లో బుధవారం సంఘం ఆధ్వర్యంలో సాహు మహరాజ్ 150వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గుగులోతు హాల్యానాయక్, గొడిశాల సంజీవ, చాగంటి ప్రభాకర్, బానోత్ లచ్చిరాం, మద్దెల వీరస్వామి, బద్రినాయక్, వీరన్న, హరినాయక్, మహేందర్, బావ్‌సింగ్ పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కేసముద్రం, జూన్ 26 : కేసముద్రం మండలం అమీనాపురం శ్రీ భూనీళా సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాల యంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. రుత్వికులు కిడాంబి నరసింహన్ దేశికన్, కృష్ణకిషోర్ త్రిపాఠి ఆధ్వర్యంలో ఉదయం యాగశాలలో నిత్యవిధి హోమం, మహాపూర్ణాహుతి, నవకలశ స్నపనం, చక్రస్నానం, సాయంత్రం దేవత ఉద్వాసన, ద్వాదశ ఆరాధనలు, సప్తావరణం, ధ్వజపట అవరోహణం, మహదాశీర్వచనం, రుత్విక్ సన్మానం, ఏకాంతసేవతో ఉత్సవాలు ముగిశాయి. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, జడ్పీటీసీ శ్రీనాథ్‌రెడ్డి ఇతర నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ బాధ్యులు వేలం రాజేశ్వర్‌రావు, బచ్చు పరమేశ్వర్, అంబటి మహేందర్‌రెడ్డి, కొయగూరి యాకూబ్‌రెడ్డి, వేలం కృష్ణమూర్తి, చీకటి వెంకట్రాంనర్సయ్య, చిదిరాల వసంతరావు, బాణాల నాగరాజు, లక్కాకుల నర్సయ్య, శ్రీరాం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష నేతలు, గిరిజన రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి


కోర్టుకు హాజరైన వామపక్షవాదులు, రైతులు

మహబూబాబాద్ టౌన్, జూన్ 26: జిల్లా కలెక్టరేట్ నిర్మాణానికి సాలార్‌తండా గిరిజన రైతుల భూములను అక్రమంగా లాక్కుంటుంటే వారికి అండగా నిలబడ్డ వామపక్ష నేతలు, గిరిజన రైతులపై అక్రమ కేసులు పెట్టారని వాటిని తక్షణమే ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్ డిమాండ్ చేశారు. సదరు కేసులో మహబూబాబాద్ జిల్లా కోర్టుకు బుధవారం వామపక్ష పార్టీల నేతలు, గిరిజన రైతులు హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపి కేసులను ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రేషపల్లి నవీన్, శివాజీ, బానోత్ మంగ్యా, ధారావత్ బాలు, భూక్య వీరు, భూక్య సురేందర్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు తగ్గించాలి

తొర్రూరు, జూన్ 26: ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలని కోరుతూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈసందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి. సిద్ధు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌళిక వసతులు లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండానే విద్యా సంవత్సరాన్ని ప్రారంభించి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తుందని వెంటనే మౌళిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ విద్యార్థుల తల్లిదండ్రులకు అంటగడుతున్నారని, వెంటనే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో ఓప్రైవేటు పాఠశాలకు కార్పోరేట్ విద్యాసంస్థ పేరు పెట్టి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని, ఆపాఠశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మనోజ్, సాయి, రిత్విక్, సాయి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, జూన్ 26 : అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బెస్త సంపూర్ణ, దారా స్నేహబిందు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మికి బుధవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, యూనియన్ నేతలు గుగులోతు సరోజ, మంగమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలి

పెద్దవంగర, జూన్ 26: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సౌకర్యాలను కల్పించాలని, ప్రైవేయిట్ పాఠశాలలో అక్రమ ఫీజులను నియంత్రణ చట్టం తీసుకురావాలని బీజేపీ మండల అధ్యక్షులు సుధాకర్ యాదవ్, విద్యార్థుల సంఘం నాయులు బత్రోజు సాయికుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తింగా ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ పిలుపునివ్వడంతో బుధవారం అవుతాపురం పాఠశాలలో బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల ఫీజులను నియంత్రించాలన్నారు. ఈకార్యక్రమంలో కోట కుమార్, అజయ్, రాజు, సురేష్, సాంబరాజు, లోకేష్ పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేయాలి

నర్సింహులపేట, జూన్ 26: పంటల వివరాల నమోదును త్వరితగతిన పూర్తి చేసి సకాలంలో ప్రభుత్వానికి అందించేలా కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి అభిమాన్యుడు మండల సిబ్బందికి సూచించారు. నర్సింహులపేట మండలం పెద్దనాగారం రెవెన్యూ పరిధిలో బుధవారం ఆయన పర్యటించి పంటల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం జీలుగ, పత్తి, పెసర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో క్షేత్రస్థాయిలో సందర్శించి పంటల సాగు వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ ప్రక్రియతో పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాలకు సులువుగా ఉంటుందన్నారు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలకు తావులేదని, గ్రామాలు, తండాల్లో గోప్యంగా విత్తనాలు, ఎరువులు విక్రయాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మంజూఖాన్, ఏఈవోలు రామకృష్ణ, కరిష్మా, రైతులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు

గార్ల, జూన్ 26 : అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడగా డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన గార్ల మండలం ముత్తితండ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తతండా నుంచి ఆంగోతు తండా వైపు వెళ్తున్న ట్రాక్టర్ ముత్తితండ సమీపంలో చిన్నబంజరకు శివారు ఆంగోతుతండా మూలమలుపు వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న గోతిలో పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ సోను త్రీవగాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు డ్రైవర్‌ను చికిత్సనిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కేసముద్రం, జూన్ 26 : వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్) ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రాములుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజాపంథా డివిజన్ నాయకులు కందాల రంగయ్య, జంపాల రాంప్రసాద్, వీరన్న, నర్సయ్య, వెంకట్రాంనర్సయ్య, విజయ, అమర్‌సింగ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శిగా ఎల్లయ్య



నెహ్రూసెంటర్, జూన్ 26 : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) దండోరా జాతీయా కార్యదర్శిగా కోండ్ర ఎల్లయ్య మాదిగను ఏకగ్రీవంగా నియమించినట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేడి పాపయ్య బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో జగ్జీవన్‌రాం కాలనీకి చెందిన కోండ్ర ఎల్లయ్య గత 30 ఏళ్లుగా దళితుల హక్కుల కోసం ఉద్యమిస్తూ వివిధ హోదాల్లో సంఘం బాధ్యతలు నిర్వర్తించినందున ఆయన సేవలను గుర్తించి జాతీయ కార్యదర్శిగా నియమించినట్లు పాపయ్య పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన జిల్లా,రాష్ట్ర, జాతీయ నాయకులకు ఎల్లయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రీజియన్ కార్యదర్శిగా నాగయ్య నియామకం

మహబూబాబాద్ టౌన్, జూన్ 26: టీజీ-ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రీజియన్ కార్యదర్శిగా మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న నాగయ్య నియామకమయ్యారు. వరంగల్‌లో రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ, రీజియన్ ఇన్‌చార్జి ఎం. శేఖరయ్య అధ్యక్షతన బుధవారం ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రీజియన్ కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో మహబూబాబాద్ డిపోకు చెందిన కండక్టర్ నాగయ్యకు కార్యదర్శిగా అవకాశం కల్పించారు. అనంతరం వరంగల్‌లో ఆర్టీసీ రీజియన్ మేనేజర్ బి. విజయభానును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆర్టీసీలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తానని నాగయ్య తెలిపారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

కురవి, జూన్ 26 :ఖరీఫ్ సీజన్‌లో రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోకుండ కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల రాజు డిమాండ్ చేశారు. కురవిలో బుధవారం జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారని, సీజన్‌ప్రారంభంలోనే అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జూలై 4, 5, 6 తేదీల్లో కేసముద్రంలో సీపీఎం జిల్లాస్థాయి తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. షేక్.మల్సూర్ అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో మండల కార్యదర్శి మలేడి కోటయ్య, నల్లపు సుధాకర్, మాలోతు కిషన్, జంగం ఉప్పలయ్య, కట్ల కృష్ణ, తగరం తిరుపతి, గొల్లపల్లి కృష్ణ, పిట్టల మోహన్‌రావు, కొర్ని రాములు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారిపై కేసు నమోదు చేయాలి

నర్సింహులపేట, జూన్ 26: నర్సింహులపేటకు చెందిన రియల్ ఎస్టేట్ గండి అశోక్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నయోదు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్య డిమాండ్ చేశారు. నర్సింహులపేట మండలంలోని జయపురంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన మందుల ఉప్పలయ్య అనే దళిత రైతుకు ఉండబడిన సర్వే నెంబరు 101బై హెచ్2లో 1.20 ఎకరాల భూమి ఉన్నదని, కుటుంబ అవసరాల నిమిత్తం అట్టి భూమిలో 1.02 ఎకరాలు రూ. 20 లక్షలకు 2021లో విక్రయించడం జరిగిందన్నారు. వాయిదాల ప్రకారం రూ18 లక్షలు చెల్లించాడని, రూ.2 లక్షలు మాత్రం మూడేళ్ల నుంచి కొర్రీలు పెడుతూ దాటవేసినట్లు తెలిపారు. ఇటీవల దౌర్జన్యంగా సాగుభూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అన్యాయాన్ని ప్రతిఘటిస్తే ఎస్సై సతీష్ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వివరించారు. బాధితుడు మందల ఉప్పలయ్యకు ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందని దళితులపై దాడులకు, దౌర్జన్యాలకు దిగితే సహించేది లేదని హెచ్చరించారు.

సాయిబాబా మందిరానికి ముస్లిం విరాళం

మరిపెడ, జూన్ 26: మరిపెడ మునిసిపల్ పరిధిలోని సాయిబాబా మందిరానికి ఓ ముస్లిం కుటుంబం బుధవారం రూ.లక్ష విరాళం ప్రకటించారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన మాదార్‌సాహెబ్ భార్య సొందుబీ, కుమారుడు-కోడలు ఎస్కే.అబ్దుల్ నజీర్-సోను(సుజాత) దంపతులు, మనవళ్లు హరూన్, శెరూన్‌లు.. మాదార్‌సాహెబ్ జ్ఞాపకార్థం సాయిబాబా ఆలయ అభివృద్ధికి రూ.1,01,116 విరాళం ప్రకటించి సాయిబాబాను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రవీంద్రాచారి ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి తీర్థ ప్రసాదములను అందచేశారు. ఆ కుటుంబ సభ్యులను ఆలయ నిర్వాహకుడు వెంపటి లక్ష్మీనారాయణ, రవీంద్రాచారి సత్కరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెద్దవంగర, జూన్ 26: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పోచంపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై బానోతు మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేడుదుల పెద్ద వెంకన్న(55) తనకు ఉన్నటువంటి 5ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ పొలం వద్ద ఉన్న ఎడ్లకు వేతవేసేందుకు వెళ్లి అక్కడే స్పృహ తప్పిపోయి అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోర్‌బంజార సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

గూడూరు, జూన్ 26 : జాతీయ గోర్‌బంజార సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుగులోతు హరినాయక్ అన్నారు. గూడూరు మండలం సీతానగరం శివారు దస్రుతండాలో ఎల్‌హెచ్‌పీఎస్ గ్రామ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరినాయక్ మాట్లాడుతూ జాతీయ గోర్ బంజార సమ్మేళనం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు రాష్ట్రంలోని అన్ని రాష్ట్రాల బంజార నాయకులు,ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లుచెప్పారు.

భూ ఆక్రమణదారుల నుంచి రక్షించాలి


కోర్టు ఆర్డర్ చూపుతున్న కొండయ్య , కవిత

మరిపెడ, జూన్ 26: భూ ఆక్రమణదారుల నుంచి తమను రక్షించాలని బాధిత రైతు కుటుంబ దంపతులు భానోత్ కొండయ్య-కవిత అధికారులను వేడుకుంటున్నారు. బుధవారం వారు మరిపెడ విలేకరులతో మాట్లాడారు. నీలికుర్తి రెవెన్యూ పరిధి పర్కాజల్‌తండా(నేతవత్‌తండా) శివార్లో సర్వే నెం.113లో తమకు ఎకరం 34గుంటల వ్యవసాయ భూమి ఉండగా అదే తండాకు చెందిన బానోత్ బాలాజీ, గోపా, శ్రీనివాస్, వెంకన్న, శంకర్‌లు ఆ భూమిని దౌర్జన్యంగా అక్రమించారన్నారు. ఈ విషయంపై తాము తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టులో దావా వేయగా కోర్టు అట్టి భూమిపై ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు. అయిన ప్పటికీ వారు కోర్టు ఆర్డర్‌ను సైతం ధిక్కరించి సదరు భూ మిని సేద్యం చేస్తున్నారన్నారని తెలిపారు. ఈ భూ ఆక్రమణదారులపై అధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు : డీఈవో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 26 : ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహించిన జి. సుభద్రమ్మ పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు సంకా బద్రినారాయణ, సీనియర్ అసిస్టెంట్ సాబీర్ అలీ, అడిషనల్ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, సూపరిండెంట్ లు ఫణి, సురేష్, అధికారులు మందుల శ్రీరాములు, అప్పారావు, ఆజాద్ చంద్రశేఖర్, విజయకుమారి, సంతోష్ పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేస్తే చర్యలు : డీఎంహెచ్‌వో

నెహ్రూసెంటర్, జూన్ 26 : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే సహించేది లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.కళావతిబాయి హెచ్చరించారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లింగ నిర్ధారణ పరీక్షలు, బాలికల పట్ల వివక్షత, ఎంటీపీ చట్టం గురించి, ఇతర ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు నియమాలకు లోబడి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. బిందుశ్రీ, నాగవాణి, అంబరీష, జోత్స్న, జగదీశ్వర్ పాల్గొన్నారు.

కురవిలో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం


బొడ్రాయి పూజా కార్యక్రమాల్లో భాగంగా గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు

కురవి, జూన్ 26 :కురవిలో బొడ్రాయి (గ్రామ దేవత) ప్రథమ వార్షికోత్స వాన్ని బుధవారం భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. అర్చకులు బుక్క వీరన్న, రాధాకృష్ణతో పాటు ఉపేందర్, సాంబయ్యలు పూజా కార్యక్ర మాలు నిర్వహించారు. తొలుత గణపతిపూజ, పుణ్యాహవచనము, గోపూజ, అభిషేకం జరిపారు. అనంతరం బొడ్రాయి అమ్మవారికి జలాభిషే కం చేపట్టారు. అడపడుచులు పెద్ద సంఖ్యలో హాజరై గ్రామ దేవతలకు జలాభి షేకం నిర్వహించారు. నూతక్కి నర్సింహారావు, మేక దామోదర్‌రెడ్డి, సోమిశె ట్టి శ్రీనివాస్, బెడద వీరన్న, ఎన్.రాజేందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగించారు..

చిన్నగూడూరు, జూన్ 26 : నీటి పంపు చుట్టూ చెత్తా చెదారం అనే శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని ఉగ్గంపల్లి ప్రాథమిక పాఠశాల ముందు ఉన్న నీటి పంపు చుట్టూ ఉన్న చెత్తా చెదారాన్ని గ్రామ కార్యదర్శి గుగుతోత్ సోమన్న గ్రామ పంచాయితీ సిబ్బందిచేత తొలగించారు.

అంబర్, గుట్కా ప్యాకెట్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గుట్కాలతో పోలీసులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 26 : జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో బాలాజీ కిరాణం షాపులో అంబర్, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... 48 అంబర్ ప్యాకెట్లు, 13 ఆర్ఆర్ ప్యాకెట్లు, 23 విమల్ ప్యాకెట్లు, 80 జీకే ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాటి విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందన్నారు. ప్రభుత్వం అంబర్, గుట్కా ప్యాకెట్లను నిషేధించినప్పటికి కొంతమంది వ్యాపారులు అక్రమ మార్గాల్లో తీసుకువచ్చి వాటిని విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. షాపు యాజమాని లక్ష్మీనారాయణపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మరిపెడ, జూన్ 26 : మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని ఉదయ బాస్కర్ కిరాణం షాప్‌లో రూ.20 వేల అంబర్ గుట్కా ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రైడ్ చేసి పట్టుకున్నారు. వీటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో స్వాధీన పరచగా ఫుడ్‌సేఫ్టీ అధికారులకు అప్పగించారు.

కీడొచ్చిందని వనభోజనాలకు..


గుడివద్ద వనభోజనాలకు వచ్చిన ఎస్సీ కాలనీవాసులు

నర్సింహుల పేట, జూన్ 26: మండలంలోని జయపురం గ్రామంలోని దళితవాడ బోసిపోయి ంది. కాలనీకి కీడొచ్చిందని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారంతా బుధవారం పక్కగ్రామమైన ముంగిమడుగు ముత్యాలమ్మ తల్లి సన్నిధికి సామూహిక వనభోజనాలకు వెళ్లారు. అమ్మవారికి మొక్కులు సమర్పించిన అనంతరం గొర్రెపోతులు, కోళ్లు ముత్యాలమ్మతల్లికి బలిచ్చి వంట చేసుకొని రోజంతా అక్కడే ఉన్నారు.